సాక్షి
ములుగు
శుక్రవారం । 14 । ఫిబ్రవరి । 2025



## సమస్యలు పరిష్కరిస్తాం

వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో సమస్యలు పరిష్కరిస్తామని మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. - 8లో



## ఏ వర్గం సంతోషంగా లేదు..

కాంగ్రెస్ పాలనలో ఏ వర్గం సంతోషంగా లేదని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
$33.2^{0}/16.1^{0}$

## వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రిపూట కాస్త చలితో పాటు మంచు కురుస్తుంది.

## న్యూస్‌రీల్

### నేడు విద్యాసంస్థలకు సెలవు

ఏటూరునాగారం: తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క సారలమ్మ మినీ జాతర సందర్భంగా నేడు (శుక్రవారం) సెలవు ఇస్తున్నట్లు ఎంఈఓ మల్లయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక జాతర సందర్భంగా అన్ని వర్గాల ప్రజలు వనదేవతలను దర్శించుకునేందుకు ఈ సెలవును ఇచ్చినట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు నేడు సెలవు ఇచ్చినట్లు ఆయా మండలాల ఎంఈఓలు ప్రకటించారు.

### గట్టమ్మ వద్ద భక్తుల సందడి



ములుగు రూరల్ : మేడారం మినీ జాతరకు వెళ్తున్న భక్తులు గట్టమ్మ అమ్మవారి వద్ద ఆగి కొబ్బరికాయలు, పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. దీంతో గురువారం గట్టమ్మతల్లి ఆలయం భక్తులతో సందడిగా మారింది. గట్టమ్మ ఆలయం వద్ద భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

### ప్రైవేట్ వాహనాల్లోనే మేడారం దర్శనానికి..



గోవిందరావుపేట : మినీ మేడారం జాతరకు అధిక సంఖ్యలో భక్తులు ప్రైవేట్ వాహనాల్లోనే తరలి వస్తున్నారు. కుటుంబ సమేతంగా అద్దె వాహనాల్లో మేడారం బాటపడుతున్నారు. ప్రైవేట్ వాహనం కుటుంబీకులకు అనుకూలంగా ఉంటుందని, ఆర్టీసీ బస్సులకు ఎదురు చూడాల్సిన పని లేకుండా సమయాన్ని వృథా చేయకుండా దర్శనం చేసుకొని తిరిగి వెళ్లడానికి భక్తులు ఎక్కువగా అద్దె వాహనాలను ఎంచుకుంటున్నారు. జాతరలో ఎటు చూసినా ప్రైవేట్ వాహనాలే దర్శనమిస్తున్నాయి. ఆర్టీసీ బస్సుల్లో సుమారుగా 6,000 మంది ప్రయాణికులను మేడారం నుంచి వారి గమ్యస్థానాలకు చేర్చామని, గురువారం 50 బస్సులను నడిపినట్లు వరంగల్–2 డిపో డిప్యూటీ సూపరింటెండెంట్ జి.వెంకటేశ్వర్లు తెలిపారు.

### మేడారం భక్తులకు స్నాక్స్ పంపిణీ




ఏటూరునాగారం/ ములుగు : మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో మేడారం జాతరకు వెళ్లే భక్తులకు, చిన్నారులకు బిస్కెట్లు, స్నాక్స్ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు గురువారం పంపిణీ చేశారు. మేడారం సమ్మక్క–సారలమ్మ మినీ జాతర సందర్భంగా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తల్లిదండ్రులతో కలిసి వెళ్తున్న చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అల్పాహారం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు భవాని, లలిత, ఆయాలు శంకుతల, సరోజన, జ్యోతి, స్వరూప, నాగమణి, మీనమ్మ, రోజా, రమణ పాల్గొన్నారు.

### తప్పిపోయిన భక్తుల గుర్తింపు, అప్పగింత



గోవిందరావుపేట : మేడారం మినీ జాతరకు వస్తున్న భక్తులలో చాలామంది తప్పిపోతున్నారు. తప్పిపోయిన భక్తులను ఐసీడీఎస్ సిబ్బంది గుర్తించి వారి కుటుంబీకులకు అప్పగిస్తున్నారు. మేడారంలోని జంపన్న వాగు వద్ద సీనియర్ అసిస్టెంట్ డీడబ్ల్యూఓ ఎం.నాగేంద్ర ఆధ్వర్యంలో తప్పిపోయిన భక్తుల గుర్తింపు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ.. పిల్లలు, వృద్ధులు అధికంగా తప్పిపోతున్నారని, వారి వివరాలు సేకరించి మైకులో ఎప్పటికప్పుడు వెల్లడిస్తున్నట్లు పేర్కొన్నారు. జాతరకు వచ్చే తప్పిపోయిన భక్తుల కోసం అమ్మవార్ల గద్దెలు, వాచ్ టవర్, జంపన్నవాగు, ఐలాపురంలో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఆచూకీ లభించే వరకు శిబిరం వద్ద వసతి కల్పిస్తున్నామని, ఇప్పటి వరకు 50 మందిని గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. శిబిరంలో ఉదయం సూపర్ వైజర్ కళావతి, ఎం.రజిని, రాధ, కల్పన, మౌనిక, రాత్రిపూట రాజు, గణేష్, శేఖర్, తిరుపతి విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

### మీరు ఏ వివాహం చేసుకుంటారు..




## ఉద్యోగం ముందు.. తర్వాతే ప్రేమ


'జీవితంలో ముందు ఉద్యోగం సాధించాక ప్రేమించుకోవచ్చు. ముందు ప్రేమ అంటే లక్ష్యం నెరవేరదు' అని అంటున్నారు యువత. ప్రేమ – ఆకర్షణ, ప్రేమ పెళ్లి, పెద్దలు కుదిర్చిన పెళ్లి తదితర అంశాలపై నగరంలోని ఎల్బీ కాలేజీలో గురువారం 30 మంది యూత్ (ఆడపిల్లలు–అబ్బాయిలు)ను సాక్షి సర్వే చేసింది. వారు తమ అభిప్రాయాలను నిక్కచ్చిగా వెల్లడించారు.

- రామన్నపేట

### టీనేజీలో ఏర్పడే ప్రేమ బలమైందేనా?




### ప్రేమా.. ఉద్యోగమా.. ఏది ముఖ్యం?





ప్రపంచంలో ప్రతీజీవి తోడు కోరుకుంటుంది. ఆ తోడు కోరుకోవడంలో ఆచితూచి అడుగులు వేయడం కీలకం. కుటుంబ పరిస్థితులు, తల్లిదండ్రులు అంటే గౌరవం, బాధ్యతలు అన్నింటిని సరిచూసుకుంటూ.. నచ్చిన జోడీని ఎంచుకోవడం, అదికూడా ఆకర్షణ కాకుండా జీవితంగా భావించి.. ఒకరి మనసు ఒకరు అర్థం చేసుకునేందుకు సమయం తీసుకొని.. అనుకున్న లక్ష్యాలను చేరుకోవడం అంటే.. ఒక మహాయజ్ఞంలాంటిదే. సరిగ్గా అదే జరిగింది మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్– ప్రియాంక దంపతుల ప్రేమ వివాహంలో. నేడు (శుక్రవారం) ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఐపీఎస్ సుధీర్ రాంనాథ్ కేకన్ తన ప్రేమ వివాహ అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే..

- సాక్షి, మహబూబాబాద్



### చెల్లెలు కలిపిన బంధం

మా ఊరుకు 20 కిలోమీటర్ల దూరంలో మా పిన్ని కూతురు అత్తగారి ఇల్లు ఉంటుంది. మా చెల్లి అంటే అందరికి ఇష్టం. ఆమెకు కూడా మేం అంటే ప్రాణం. అందుకోసమే తరచూ నేను అక్కడికి వెళ్లేవాడిని. అక్కడ మా చెల్లి దగ్గరికి తన స్నేహితురాలు ప్రియాంక వచ్చేది. చెల్లిని కలిసినప్పుడు ఒకరోజు ప్రియాంకను పరిచయం చేసింది. ఆమె కూడా సరదాగా మాట్లాడేది. కానీ, అది ప్రేమగా మారుతుందని అనుకోలేదు. చూస్తూ ఉండగానే ఒకరోజు నేనంటే ఇష్టమని నా చెల్లెలికి చెప్పింది. ఈ విషయం చెల్లి నాకు చెప్పేందుకు తడబడినా.. చివరకు చెప్పింది.



మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

నేడు ప్రేమికుల దినోత్సవం

# ముందు తనే ప్రపోజ్

## ఆరు నెలల తర్వాత.. నా అభిప్రాయం చెప్పా..

- మా చెల్లెలి స్నేహితురాలిగా ప్రియాంక పరిచయమైంది.. అనంతరం ప్రేమగా మారింది..
- ఇరు కుటుంబాలు పెళ్లికి ఓకే.. కానీ, సివిల్స్ తర్వాతే అన్నా..
- ఒకరినొకరు అవగాహనతో వెళ్తేనే బంధం బలంగా ఉంటుంది
- వాలెంటైన్స్ డే సందర్భంగా 'సాక్షి'తో తన ప్రేమ వివాహ అనుభవాలను పంచుకున్న మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

### నాన్న అంటే అందరికీ భయమే.. కానీ చెప్పక తప్పదు..

ఒకవైపు చెల్లెలి ఫ్రెండ్. అప్పటికే ఆమె బీటెక్ చేసి మంచి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. నేను సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నా. నేనంటే ఇష్టమని ప్రియాంక చెప్పడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యా. మొదట ఏమి చెప్పాలో తెలియలేదు. సివిల్స్ సాధనే నా లక్ష్యం. ఈ సమయంలో ప్రేమ ఏంటి అనుకున్నా. నా అభిప్రాయం చెప్పేందుకు కొంత సమయం అడిగాను. ఆమె కూడా సరేనంది. మాది పెద్ద కుటుంబం. నాన్న అంటే ముగ్గురు అన్నలతోపాటు అందరికీ భయమే. కానీ, ఆయన మాత్రం మాతో సరదాగానే ఉంటూనే పద్ధతిగా ఉండాలని చెబుతారు.. ఇటువంటి పరిస్థితిలో ప్రియాంక ప్రపోజ్ చేసిన విషయం ఇంట్లో చెప్పలేను. అలా అని ఉండలేను. నాలోనే నేను ఆలోచనలో పడ్డా. ఆరు నెలల తర్వాత ప్రియాంకకు ఓకే అని నా అభిప్రాయం చెప్పాను.

నేను, ప్రియాంక ఒకరినొకరం ఇష్టపడిన విషయం ఇంట్లో తెలిసింది. కొన్నిరోజులు చర్చలు జరిగాయి. ముందుగా ప్రియాంక కుటుంబ సభ్యులు మా ఇంటికి వచ్చి మాట్లాడారు. కొంతసమయం తీసుకొని మా కుటుంబ సభ్యులు వారి ఇంటికి వెళ్లారు. పెళ్లి చేయాలని నిర్ణయించారు. కానీ, నేను కొన్ని ఆంక్షలు పెట్టాను. ఆ సమయంలో నేను సివిల్స్ ప్రిపరేషన్‌లో ఉన్న. నేను సివిల్స్ సాధించిన తర్వాతే పెళ్లి అనుకున్నాం. విషయాన్ని ఇటు కుటుంబ సభ్యులకు, అటు ప్రియాంకకు చెప్పాను. నా ప్రతిపాదనకు అందరూ అంగీకరించారు. సివిల్స్ బాగా రాశాను. మంచి ర్యాంకు వస్తుందని చెప్పాను. అంతా సంప్రదాయం ప్రకారం లగ్నపత్రిక పెట్టుకున్నారు. పెళ్లికి 15 రోజుల ముందు సివిల్స్ రిజల్ట్స్ వచ్చాయి. ఐపీఎస్‌కు సెలక్ట్ అయ్యాను. కుటుంబ సభ్యులు, మిత్రులు అభినందనలు తెలిపారు. ప్రియాంక ఫోన్‌లో అభినందనలు తెలిపినప్పుడు ఇద్దరి సంతోషం చెప్పలేను. ఆ తరువాత సంప్రదాయబద్ధంగా మా వివాహం జరిగింది. నేను అనుకున్నట్లు ఒకవైపు ప్రియాంకను, మరోవైపు ఐపీఎస్‌ను సాధించాను. ఇప్పటివరకు మా వైవాహిక జీవితం ఆనందంగా సాగుతోంది. మా ఇద్దరికి తోడు మా బాబు విరాజ్. ముగ్గురం సంతోషంగా ఉన్నాం.

**అవగాహన లేకపోతే బంధం గుదిబండనే..**

మనిషికి మహిళ తోడు అవసరం. వివాహం అనేది అందరి జీవితంలో కీలక ఘట్టం. దీనికి ఆచితూచి అడుగులు వేయాలి. ప్రేమ అనేది ఒక ఆకర్షణ కావద్దు. ఇద్దరి బంధమనుకోవాలి. ఒకరి భావాలు మరొకరు పంచుకుంటూ ఒక అవగాహనతో వెళ్లాలి. లేకపోతే ఇరువురి కుటుంబ సభ్యులకు గుదిబండగానే ఉంటుంది. ఇష్టపడటం, అనుకున్న లక్ష్యాలను సాధించి తర్వాత వివాహం చేసుకుంటే ఏ ఇబ్బందీ ఉండదు. నేటి యువత ఈ దిశగా ఆలోచించాలి. కని పెంచిన తల్లిదండ్రులను గౌరవించాలి. అప్పుడే ఆనందంగా ఉంటుంది.

సాక్షి చర్చావేదికలో పాల్గొన్న విద్యార్థులు



## ప్రేమ.. లక్ష్యం రెండూ ముఖ్యమే

- తల్లిదండ్రులను ఒప్పించి ప్రేమికులుగా గెలవాలి
- సమయాన్ని వృథా చేసుకోవద్దు..
- 'ప్రేమ–ఆకర్షణ'పై సాక్షి చర్చా వేదికలో అభిప్రాయాలు వెల్లడించిన పలువురు విద్యార్థులు

రామన్నపేట: 'ప్రేమించడానికి, ప్రేమను వ్యక్తీకరించడానికి ప్రేమికుల దినోత్సవం ఒక్క రోజు సరిపోదు. ప్రేమను పంచాలనుకుంటే ప్రతీ రోజు ప్రేమికుల దినోత్సవమే. ప్రేమించడం, ప్రేమ వివాహాలు చేసుకోవడం తప్పు కాదు. ప్రేమ మోజులో పడి తమ సమయాన్ని వృథా చేసుకుని లక్ష్యాలను వదిలిపెట్టి తల్లిదండ్రులకు చెడ్డ పేరు తేవడం తప్పు. పాఠశాల విద్య వయస్సులో, ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలో ప్రేమపేరుతో విచ్చలవిడిగా తిరగడం సమంజసం కాదు. ఆ సమయంలో ఏర్పడేదంతా ఆకర్షణ మాత్రమే. ప్రేమకు, ఆకర్షణకు మధ్య మధ్య తేడా తెలుసుకుని సరైన వయస్సులో.. సరైన సమయంలో ప్రేమించడం, తల్లిదండ్రులను ఒప్పించడం.. లక్ష్యాలను సాధించి సంతోష జీవనం గడిపే ఆదర్శమైన ప్రేమ జంటగా నిలవాలి' అని ఎల్బీ కళాశాల విద్యార్థులు అంటున్నారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఆ కళాశాలలో గురువారం 'ప్రేమ–ఆకర్షణ'పై నిర్వహించిన సాక్షి చర్చా వేదికలో యువత తమ అభిప్రాయాలను వెల్లడించింది.

### తల్లిదండ్రులకు చెడ్డపేరు తేవొద్దు..



ప్రస్తుతం పాఠశాల విద్యనభ్యసించే సమయంలో, ఇంటర్మీడియట్ విద్యనభ్యసిస్తున్న కాలంలో ప్రేమ పేరుతో కొంత మంది విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. ఈసమయంలో జీవితంపై పూర్తి స్థాయి అవగాహన కూడా ఉండదు. తెలిసీ తెలియని వయసులో ప్రేమ పేరుతో సమయం వృథా చేసుకుని తల్లిదండ్రులకు చెడ్డ పేరు తేవొద్దు. - ఎం. సృజన

### ప్రేమలో పడి లక్ష్యం మరవొద్దు..



ప్రేమ అంటే ఏంటో తెలుసుకోవాలంటే.. వారికి కనీస వయస్సు రావాలి. ఏమీ తెలియని వయస్సులో ఆకర్షణను ప్రేమ అనుకుని సమయాన్ని వృథా చేసుకోవద్దు. ప్రేమతో పాటు విద్యలో సైతం రాణించాలి. ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడే వరకు ప్రేమలో పడి లక్ష్యాలను మరవొద్దు. - రిషిత

### నష్టపోయేది అబ్బాయిలే ఎక్కువ



ప్రేమ వ్యవహారాల వల్ల ఎక్కువ శాతం అబ్బాయిలే నష్టపోతారు. ప్రేమలో పడి అమ్మాయి కోసం నిత్యం సమయాన్ని వృథా చేసుకునేది అబ్బాయిలు మాత్రమే. చివరికి అమ్మాయిలకు ఎలాంటి నష్టం జరగదు. కానీ జీవితాంతం బాధను అనుభవించేది అబ్బాయిలే.

- సాయికృష్ణ

### పేదలకు ప్రేమ శాపమే



పేద తల్లిదండ్రులు నిత్యం ఎంతో కష్టపడి తమ పిల్లలను చదివిస్తుంటారు. ఇలాంటి విద్యార్థులు చాలా మంది ప్రేమలో పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. పిల్లలు కళాశాలకు వెళ్లి విద్యనభ్యసిస్తున్నారని తల్లిదండ్రులు గర్వపడుతుంటారు. కానీ పిల్లలు ప్రేమలో పడ్డారని తెలిస్తే తల్లిదండ్రులు ఆ బాధ భరించలేరు. ప్రేమ పెళ్లిళ్లు చేసుకుంటే ధనికుల ఇళ్లల్లో పెద్దగా ప్రభావం చూపదు కానీ.. పేదల ఇళ్లల్లో శాపంగానే మారుతుంది. - సౌమ్య

### వ్యత్యాసం తెలియాలి..



ప్రస్తుతం ప్రేమ అనే పదానికి అర్థం తెలియట్లేదు. పాఠశాల సమయం నుంచే ప్రేమ కలాపాలు కొనసాగుతున్నాయి. ఆకర్షణకు.. ప్రేమకు తేడా తెలుసుకోవాలి. మంచి విద్యార్థులుగా గొప్ప లక్ష్యాలు దిశగా అడుగులు వేయాలి.

- దేవేందర్‌రావు

### తల్లిదండ్రులను ఒప్పించాలి



ప్రేమించడం గొప్ప కాదు.. ప్రేమలో ఎన్ని కష్టాలు వచ్చినా ఎదుర్కొని తల్లిదండ్రులను ఒప్పించాలి. అంతే కానీ తల్లిదండ్రులను సమాజంలో కించపరిచేలా వ్యవహరించవద్దు

- అమాన్

### ప్రేమ ఆకర్షణ మాత్రమే..



ప్రేమ అనేది ఒక్క ఆకర్షణ మాత్రమే. మన లక్ష్యాలకు అనుగుణంగా అడుగులు వేయాలి. మెరుగైన విద్యనభ్యసిస్తూ ఎవరు ఊహించని రీతిలో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలి. - దీక్షిత

### ప్రేమికుల దినోత్సవమే అనవసరం



భారతీయ సంస్కృతి ప్రకారం ప్రేమికుల దినోత్సవం అనవసరం. ఇది ఒక పాశ్చాత్య సంస్కృతి. ప్రేమిస్తే ప్రతీ రోజు ప్రేమికుల దినోత్సవమే. ఇలాంటి రోజులను సెలబ్రేట్ చేసుకోవడం వల్ల దేశానికి ఒరిగేదేమీ లేదు.

- ముజామిల్ షరీఫ్

## పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ

ఎస్‌ఎస్‌తాడ్వాయి : మేడారం మినీజాతరలో కార్మికులు చేస్తున్న పారిశుద్ధ్య పనులను డీపీఓ దేవరాజ్ గురువారం పర్యవేక్షించారు. మినీ జాతరను పురస్కరించుకొని వేలాదిగా భక్తులు తరలి వస్తుండడంతో అక్కడక్కడ చెత్త పడేస్తున్నారు. దీంతో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్మికులతో చెత్తను తొలగించి శుభ్రం చేయిస్తున్నారు. తెల్లవారుజాము నుంచే కార్మికులు సమ్మక్క–సారలమ్మ గద్దెల సమీపంలో, ఐలాండ్ ప్రాంతం, జంపన్నవాగు, ఐటీడీఏ గెస్ట్ హౌజ్ రోడ్ల వెంట చెత్తచెదారాన్ని తొలగించి రోడ్లను ఊడ్చి శుభ్రం చేస్తున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా, ఎక్కడ చెత్త పేరుకుపోకుండా చర్యలు చేపడుతున్నట్లు డీపీఓ దేవరాజ్ పేర్కొన్నారు.



పనులను పర్యవేక్షిస్తున్న డీపీఓ దేవరాజ్

## జేఈఈ మెయిన్స్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ




మైఖేల్



ఈశ్వర్



మురళి



విజేందర్



కార్తీక్

ఏటూరునాగారం : తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల (బాలుర) కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఆల్ ఇండియా జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం తెలిపారు. విద్యార్థులు కార్తీక్ 65 శాతం, విజేందర్ 59 శాతం, మురళి 58 శాతం, ఈశ్వర్ 56 శాతం, మైఖేల్ 55 శాతం సాధించారని అన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు. రాజునాయక్, శ్రీరాములు, వీరన్న, గోపాలరావు, జైపాల్, కుమారస్వామి, శంకర్, కృష్ణయ్య, కృష్ణ, కిరణ్ పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాపై పర్యవేక్షణ

- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు
- ఎస్పీ శబరీష్



ఇసుక క్వారీ వద్ద రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

మంగపేట: ఇసుక అక్రమ రవాణాను నియంత్రించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఎస్పీ డాక్టర్ శబరీష్ ఆదేశించారు. మండలంలోని రాజుపేట, కత్తిగూడెం ఇసుక క్వారీలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రస్తుత ఇసుక నిల్వలపై ఆరాతీసి రికార్డులను పరిశీలించారు. క్వారీలో పనిచేసే సిబ్బంది ఎవరైనా ఎటువంటి అక్రమాలకు పాల్పడినా, జీరో బిల్లులు, డబుల్ ట్రిప్, అదనపు లోడింగ్, నకిలీ వేబిల్లులు, తప్పుడు వాహనంలో రవాణా, గమ్యస్థానం లాంటి ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా అక్రమ రవాణాకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై టీవీఆర్ సూరి, సిబ్బంది ఉన్నారు.

భక్తులతో కిక్కిరిసిన గద్దెల ప్రాంగణం



## తనివితీరా మొక్కులు

- మేడారం మినీజాతరకు పోటెత్తిన భక్తులు
- ఉదయమే ఆలయాలకు వెళ్లిన వనదేవతలు



వనదేవతలకు భక్తులు తనివితీరా మొక్కులు చెల్లించారు. నిలువెత్తు బంగారం, కోడి, యాటలను సమర్పించారు. బుధవారం రాత్రి అంతా గద్దెల వద్ద జాగారం చేసిన పూజారులు గురువారం ఉదయం పొద్దుపొడువక ముందే అమ్మవార్లను తీసుకొని మేడారం, కన్నెపల్లి ఆలయాలకు తిరిగి వెళ్లారు. భక్తులతో అమ్మవార్ల గద్దెల ప్రాంగణం కిక్కిరిసింది. మొక్కుల అనంతరం భక్తులు మేడారం పరిసర ప్రాంతాల్లోని చెట్ల కింద వంటావార్పు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు. మంత్రి సీతక్క అమ్మవార్లను దర్శించుకున్నారు. - ఎస్‌ఎస్ తాడ్వాయి

- వివరాలు 8లో

## క్లుప్తంగా

### సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి



హన్మకొండ: సంత్ శ్రీ సేవాలాల్ జయంతిని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్ కోరారు. ఈమేరకు బీజేపీ తెలంగాణ ఎంపీలతో కలిసి న్యూ ఢిల్లీలో కేంద్ర కల్చరల్ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా సీతారాం నాయక్ మాట్లాడుతూ.. బంజారాల చరిత్ర, సంస్కృతి, వారి విశిష్టతను రక్షించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని తన వంతుగా సుదీర్ఘకాలంగా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్, బీజేపీ ఎంపీలు పాల్గొన్నారు.

### కేయూ ప్రొఫెసర్‌కు పేటెంట్



పరిశోధకురాలిని అభినందిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: మేధో సంపత్తి హక్కులు (ఐపీఆర్)లో భాగంగా కాకతీయ యూనివర్సిటీ ఐపీఆర్‌సెల్ నుంచి కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ ఎస్.ప్రసాద్, ఆ కళాశాల పరిశోధకురాలు దుర్గాపాలాటే వారి సారథ్యంలో పరిశోధన అంశానికి పేటెంట్ హక్కు లభించింది. 'ఎకో క్రిస్టల్ ఇన్ క్రీస్ ది బయో అవయబులిటీ ఆఫ్ కర్‌క్యూమిన్ అండ్‌ది ప్రిపరేషన్ మెథడ్ థేర్ ఆఫ్' అనే పరిశోధన అంశానికి పేటెంట్ పొందినట్లు ఆమె తెలిపారు. దీనికి సంబంధించిన పేటెంట్ సర్టిఫికెట్ న్యూఢిల్లీ కంట్రోల్ ఆఫ్ పేటెంట్స్ ఇండియన్ పేటెంట్ ఆఫీస్ నుంచి అందినట్లు కేయూ ఐపీఆర్ సెల్ సంచాలకుడు ప్రొఫెసర్ ఎస్.ప్రసాద్ తెలిపారు. ఈ పేటెంట్ కాలవ్యవధి 20 ఏళ్ల వరకు ఉంటుందని తెలిపారు. ఈమేరకు గురువారం క్యాంపస్‌లో వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ ప్రసాద్.. పరిశోధకురాలు దుర్గపాలాటేను అభినందించారు.

### నేత్రదానం

ఖిలా వరంగల్: వరంగల్ దూపకుంటకు చెందిన రాజనాల వెంకయ్య (80) అనారోగ్య సమస్యలతో గురువారం మృతి చెందారు. మృతుడి కుమారులు బాబు, వీరస్వామి అంగీకారం మేరకు వెంకయ్య నేత్రాలను తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి ఆధ్వర్యంలో వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యులు, ఎల్వీ ప్రసాద్ నేతృత్వంలో టెక్నీషియన్ లక్ష్మణ్ సేకరించారు. కార్యక్రమంలో ధర్మరాజు, బరుపట్ల శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, కుసుమ రమేశ్, మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

# తనివితీరా మొక్కులు



## మినీజాతరకు పోటెత్తిన భక్తులు

## ఉదయమే ఆలయాలకు తరలిన వనదేవతలు

- దారి పొడువునా వరం పట్టిన భక్తులు
- కిక్కిరిసిన అమ్మవార్ల గద్దెల ప్రాంగణం



వరం పట్టిన భక్తుల పైనుంచి వస్తున్న సమ్మక్క పూజారులు



క్యూలో భక్తులు

ఎస్ఎస్ తాడ్వాయి: వనదేవతలు సమక్క, సారలమ్మకు భక్తులు తనివితీరా మొక్కులు చెల్లించారు. నిలువెత్తు బంగారం, కోడి, యాటలు సమర్పించారు. తమను సల్లంగా చూడాలని అమ్మవార్లను వేడుకున్నారు. కాగా, ప్రతి రెండేళ్లకొసారి జరిగే మహాజాతరకు తీసిపోని విధంగా ఈసారి మినీజాతర సాగుతోంది. మేడారం, కన్నెపల్లిల్లో రెండు రోజుల పాటు మండమెలిగె పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. బుధవారం రాత్రి మేడారం, కన్నెపల్లి ఆలయాల నుంచి అమ్మవార్లతో గద్దెల చేరుకున్న పూజారులు.. రాత్రంతా జాగారం నిర్వహించి ఉదయం పొద్దుపొడువక ముందే గద్దెల వద్ద నుంచి అమ్మవార్ల తీసుకుని మేడారం, కన్నెపల్లి ఆలయాలకు తరలారు. ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి యాటలను నైవేద్యంగా సమర్పించారు. రెండు రోజుల మండమెలిగె పండుగ బుధవారంతో మొదలై గురువారంతో ముగిసింది.

**దారిపొడవునా భక్తుల వరం...**

గద్దెల వద్ద నుంచి సమ్మక్క పూజారులు అమ్మవారిని తీసుకుని బయలుదేరారు. ఈ సమయంలో అక్కడి చేరుకున్న స్థానిక ఆదివాసీలు సమ్మక్క ఆర్చ్ వద్ద నుంచి ఐలాండ్ వరకు వరం పట్టగా.. సమ్మక్క పూజారులు వారిని తాకుతూ ఆలయ మార్గంలో వెళ్లారు. కాగా, అమ్మవారిని తీసుకువచ్చే పూజారులు తాకుతూ వెళ్తే శుభం కలుగుతుందని భక్తుల విశ్వాసం.

**కిక్కిరిసిన అమ్మవారి గద్దెల ప్రాంగణం..**

సమ్మక్క, సారలమ్మను దర్శించుకునేందుకు గురువారం భక్తులు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. దీంతో అమ్మవార్ల గద్దెల ప్రాంగణం కిక్కిరిసింది. దేవతలకు మొక్కులు చెల్లించిన భక్తులు మేడారంలోని సమ్మక్క గుడి, కన్నెపల్లిలోని సారలమ్మ గుడికి వెళ్లి అమ్మవార్లను దర్శించుకున్నారు. మొక్కుల అనంతరం భక్తులు మేడారం పరిసర ప్రాంతాల్లోని చెట్ల కింద వంటావార్పు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు.

**మహాజాతరకు మాస్టర్ ప్లాన్ సిద్ధం : రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క**

2026లో జరిగే మహాజాతరకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. గురువారం అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గోవిందరాజు, పగిడిద్దరాజులకు పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మినీ జాతరలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించామన్నారు. అధికారులు నిరంతరం భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షిస్తున్నారన్నారు. ఇప్పటికి సుమారు 6 లక్షల మంది భక్తులు మొక్కులు చెల్లించుకున్నారని, ఇంకా రెండు రోజుల పాటు జరిగే జాతరకు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు , పూజారులు పాల్గొన్నారు.



అమ్మవారికి ముడుపు కడుతున్న మహిళలు



జాతరలో వెంట్రుకలు సమర్పిస్తున్న చిన్నారి



సమ్మక్కకు చీర సమర్పిస్తున్న మంత్రి సీతక్క



మొక్కులు చెల్లించుకునేందుకు వెళ్తున్న భక్తులు



జంపన్నవాగులో షవర్ల కింద స్నానం ఆచరిస్తున్న భక్తులు

## గ్రేట్ తెలంగాణ పోలీస్..

- శ్రీలంక వాసి ప్రశంస
- మేడారంలో పోగొట్టుకున్న పాస్ పోర్టు అప్పగించిన సీసీఎస్ పోలీసులు



ములుగు: శ్రీలంక రాజధాని కొలంబోకు చెందిన పద్మ కుమారస్వామి గురువారం సాయంత్రం సమ్మక్క–సారలమ్మను దర్శించుకోవడానికి మేడారం వచ్చింది. ఈ క్రమంలో ఆమె తన బ్యాగుతో పాటు పాస్‌పోర్టు పోగొట్టుకుంది. ఈ విషయాన్ని డ్యూటీలో ఉన్న సీసీఎస్ పోలీస్ సిబ్బంది రాజ్‌కుమార్, మధు, నాగరాజుకు తెలిపింది. స్పందించిన కానిస్టేబుళ్లు అర్ధగంట సమయంలోనే బ్యాగు, పాస్ పోర్టును గుర్తించి పద్మకుమారస్వామికి అందించారు. దీనిపై స్పందించిన ఆమె.. ములుగు జిల్లా పోలీసుల పనితీరుపై సంతోషం వ్యక్తం చేసింది. గ్రేట్ తెలంగాణ పోలీస్ అంటూ కొనియాడుతూ కృతజ్ఞతలు తెలిపింది.

# కాంగ్రెస్ పాలనలో ఏ వర్గం సంతోషంగా లేదు



మాట్లాడుతున్న శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి

- శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి

హన్మకొండ : కాంగ్రెస్ పాలనలో ఏ వర్గం సంతోషంగా లేదని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఏ పార్టీ ఇవ్వని ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. హామీలు అమలు చేయకుండా దగా చేస్తుందని దుయ్యబట్టారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి కమిషన్ నియమించినా ప్రయోజనం లేదని విమర్శించారు. సర్వే అంతా తప్పుల తడక అని రాష్ట్ర జనాభాతో పాటు బీసీల జనాభా తగ్గించి చూపారన్నారు. జనాభా తగ్గించడం ద్వారా చట్ట సభల సీట్లు తగ్గుతాయని, కేంద్రం నుంచి వచ్చే నిధుల్లో కోత పడుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కచ్చిత కులగణన, సర్వే చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కవులు, కళాకారుల కోసం కేసీఆర్ ఆలోచనతో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్ని వ్యాపార కేంద్రంగా మార్చారన్నారు. కళా క్షేత్రం కళాకారులకు అందుబాటులో లేకుండా చేశారని, ఫీజు రూ.1.50 లక్షలు నిర్ణయించడం దారుణమన్నారు. కళాకారులకు అందుబాటులో ఫీజు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. త్వరలో కళాకారులతో కలిసి పోరాటం చేస్తామన్నారు. టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవ రెడ్డి, నాయకులు పులి రజనీకాంత్, తాళ్లపల్లి జనార్దన్, బొంగు అశోక్ యాదవ్, బోయినిపల్లి రంజిత్ రావు, చెన్నం మధు, జె.రమేశ్, లక్ష్మీనారాయణ, జానకీరాములు సారంగపాణి, కృష్ణ పాల్గొన్నారు.

# వరంగల్ మార్కెట్‌లో సమస్యలు పరిష్కరిస్తాం

- మిర్చి సీజన్ పై ప్రత్యేక దృష్టి
- మార్కెటింగ్ శాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ రవికుమార్



చాంబర్ ప్రతినిధులతో సమావేశమైన మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, అదే విధంగా మిర్చి సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్ అన్నారు. గురువారం వరంగల్ ఏనుమాముల మార్కెట్‌కు వచ్చిన రవికుమార్.. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్చి పంటకు గిట్టుబాటు ధర లభించకుంటే కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేస్తే ప్రభుత్వం 6నెలల పాటు వడ్డీ లేకుండా సరుకు మొత్తం ధరలో 75శాతం రుణం అందిస్తున్నదని రవికుమార్ తెలిపారు. కాగా, మార్కెట్ పరిధిలోని కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ సామర్థ్యం 30 లక్షలకు పెరిగిందని చాంబర్ ప్రతినిధులు తెలిపారు.

**పంట ఉత్పత్తుల ధరల కల్పనకు కృషి**

మహబూబాబాద్ రూరల్ : రైతుల కష్టానికి తగిన విధంగా మార్కెట్‌లో పంట ఉత్పత్తులకు ధరలు వచ్చేలా కృషి చేస్తామని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ రవికుమార్ అన్నారు. గురువారం మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌ను వ్యవసాయ శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఏడీ రవికుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం మిర్చి సీజన్ నేపథ్యంలో అనుకున్న మేర ధరలు రావడం లేదని రైతులు చెప్పారన్నారు. ఇతర దేశాలకు మిర్చి ఎగుమతి చేస్తున్న సందర్భంగా అక్కడ ధర లేకపోవడంతో స్థానికంగా పంటకు తక్కువ ధర పలుకుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అయినా తమ శక్తి మేరకు వ్యాపారులతో మాట్లాడి మిర్చికి ధర కల్పించే విషయంలో ఆలోచన చేయాలని సూచిస్తామన్నారు. మానుకోట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, వైస్ చైర్మన్ మదన్ గోపాల్ లోయ, జిల్లా మార్కెటింగ్ అధికారి వెంకటేశ్వర్లు, మార్కెట్ సెక్రటరీ షంషీర్, సూపర్‌వైజర్ రమేశ్, అసిస్టెంట్ సెక్రటరీ అరుణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

**సస్పెన్షన్‌లపై పునరాలోచన చేయాలి..**

వరంగల్ మార్కెట్‌లో లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయగా కేవలం 173టీఆర్‌లలో తేడాలున్నాయంటూ కార్యదర్శిని సస్పెండ్ చేయడం సరికాదని, ఇంత పెద్ద మొత్తంలో కొనుగోళ్లు జరుగుతున్న సమయంలో రైతుల ఇబ్బందులు గుర్తించి చూసీచూడనట్లు వ్యవహరించడం పరిపాటని చాంబర్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈవిషయంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరగా.. దీనిపై సానుకూల నిర్ణయం వస్తుందని తాను భావిస్తున్నట్లు రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో డీడీఎం పద్మావతి, ఇన్‌చార్జ్ సెక్రటరీ జి.రెడ్డి, చాంబర్ ప్రతినిధులు వేద ప్రకాశ్, ఎన్ రెడ్డి లింగారెడ్డి, రాజు ఖరాణీ, సంపత్, గ్రేడ్ 2 కార్యదర్శులు రాము, అంజిత్‌రావు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ భవిష్యత్ కోసం 'కడియం' పార్టీ మారాడు

- ఉప ఎన్నికలొస్తే ఘన్‌పూర్‌లో ఎగిరేది గులాబీ జెండానే
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

జనగామ రూరల్: రాజకీయ భవిష్యత్ కోసం కడియం శ్రీహరి పార్టీ మారాడని, పార్టీ ఫిరాయింపుల కేసు సుప్రీంకోర్టులో ఉందని, ఉప ఎన్నికలొస్తే స్టేషన్ ఘన్‌పూర్‌లో ఎగిరేది గులాబీ జెండానే అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. అక్రమ కేసులతో భయపడమని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బెదిరింపులతో బీఆర్ఎస్ కార్యకర్తలను ఇబ్బందుల పెడితే ఊరుకోమని హెచ్చరించారు. గురువారం పెంబర్తిలో హస్తకళాకారుల సొసైటీని సందర్శించారు. సభ్యులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం హస్తకళాకారుల సమస్యలు పరిష్కరించాలని, వారు తయారు చేసే ఉత్పత్తులకు తగిన ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ బెదిరింపులకు గురిచేస్తే సహించేది లేదన్నారు. 'మేము పింక్ బుక్ మెయింటైన్ చేస్తున్నాం. అందులో అన్నీ రాసుకుంటున్నాం. ఇంతకింత తిరిగి చెల్లిస్తాం. లెక్కలు ఎలా రాయాలో మాకు తెలుసు. మీ లెక్కలన్నీ తీస్తాం. అన్నింటినీ మేం అధికారంలోకి వచ్చాక తిరిగి చెల్లిస్తాం' అన్నారు. రైతు డిక్లరేషన్ పై నిలదీస్తారని రాహుల్ గాంధీ వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నారని విమర్శించారు. బీసీలకు విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్ల పెంపునకు మూడు వేర్వేరు బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. సంక్రాంతి నుంచి సన్నబియ్యం ఇస్తామని చెప్పి ఇంకా ఇవ్వలేదని, కాంగ్రెస్ అబద్ధాలను ప్రజల్లో ఎండగడుతామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేషం, మాజీ మున్సిపల్ చైర్మన్ పోకల జమున, సేవెల్లి సంపత్, ఇర్రి రమణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేశ్, ప్రేమలతారెడ్డి, మాజీ ఎంపీపీ కళింగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# బరిలో 19 మంది అభ్యర్థులు

- ముగిసిన టీచర్ ఎమ్మెల్సీ నామినేషన్ల ఉపసంహరణ



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ల ఉపసంహరణ గురువారం ముగిసింది. ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 19 మంది అభ్యర్థులు బరిలో ఉండనున్నారు. ఈ నెల 3వ తేదీన నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమై పదో తేదీన పూర్తయ్యాయి. మొత్తం 23 మంది 50 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. 11వ తేదీన జరిగిన స్క్రూటినీలో ఒక అభ్యర్థి తన నామినేషన్ పత్రాలపై సంతకం పెట్టకపోవడంతో ఎన్నికల అధికారులు ఆ నామినేషన్‌ను తిరస్కరించారు. 22 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించారు. 13వ తేదీ గురువారం నామినేషన్ల ఉపసంహరణకు ఆఖరు తేదీ కావడంతో హైదరాబాద్ కొత్తపేటకు చెందిన కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, సూర్యాపేట జిల్లా మునగాల మండలానికి చెందిన బండారు నాగరాజుతో పాటు కోదాడ మండలం లక్ష్మీపురానికి చెందిన జి. కోటిరెడ్డిలు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. చివరగా 19మంది అభ్యర్థులు మిగిలారు.

**బరిలో ఉంది వీరే**

అలుగుబెల్లి నర్సిరెడ్డి – స్వతంత్ర (యూటీఎఫ్ మద్దతు), పులి సరోత్తం రెడ్డి – బీజేపీ (టీపీయూఎస్ మద్దతు), శ్రీపాల్‌రెడ్డి పింగిళి – స్వతంత్ర (పీఆర్‌టీయూ–టీఎస్ మద్దతు), పూల రవీందర్ – స్వతంత్ర (ఎస్టీయూ మద్దతు), గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి – స్వతంత్ర (టీచర్స్ జేఏసీ మద్దతు), ఎస్.సుందర్‌రాజు– స్వతంత్ర, డాక్టర్ కొలిపాక వెంకటస్వామి – స్వతంత్ర, లింగిడి వెంకటేశ్వర్లు – ప్రజావాణి పార్టీ, అర్వ స్వాతి – స్వతంత్ర, కంటె సాయన్న – స్వతంత్ర, పన్నాల గోపాల్‌రెడ్డి – స్వతంత్ర, ఏలె చంద్రమోహన్ – స్వతంత్ర, చాలిక చంద్రశేఖర్ – స్వతంత్ర, జంకిటి కైలాసం – స్వతంత్ర, జి. శంకర్ – స్వతంత్ర, తలకోల పురుషోత్తం రెడ్డి – స్వతంత్ర, తాటికొండ వెంకట రాజయ్య – స్వతంత్ర, దామెర బాబురావు – స్వతంత్ర, బంక రాజు – స్వతంత్ర.

# అన్న తమ్ముడు.. ఓ తహసీల్దార్!

## భూమి పట్టా కోసం అన్న వెళ్తే తమ్ముడి భూమిపై రిమార్క్

- వరంగల్ తహసీల్దార్ కార్యాలయంలో విచిత్ర పరిస్థితి
- హైకోర్టు ఆదేశాలు సైతం ఉల్లంఘన



బాధితుడు కొమురయ్య

సాక్షి, వరంగల్: అన్న.. తమ్ముడు.. ఓ తహసీల్దార్.. ఇది సినిమా టైటిల్ అనుకుంటున్నారా.. ఇది రీల్ లైఫ్ కాదు.. రియల్ లైఫ్‌కు సరిపోతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. తన భూమికి సంబంధించిన సాదాబైనామా దరఖాస్తు పరిష్కరించాలని ఇటీవల వరంగల్ మండలం కొత్తపేటకు చెందిన అంకేశ్వరపు కొమురయ్య హైకోర్టుకు వెళ్లాడు. దరఖాస్తును విచారించి బాధితుడికి 8 వారాల్లోగా న్యాయం చేయాలని కోర్టు ఆదేశాలిచ్చింది. కొత్తపేట సర్వే నంబర్ 73లో అన్న అంకేశ్వరపు కొమురయ్యతోపాటు గతంలో సేల్ డీడ్ ప్రకారం కొనుగోలు చేసిన తమ్ముడు ఎల్లస్వామి పేరు మీద ఉన్న ఎకరం ఒక గుంట భూమిపై కోర్టు కేసు ఉండడంతో తదుపరి క్రయవిక్రయాలు ఉండవని 'ధరణి'లో తహసీల్దార్ మహమ్మద్ ఇక్బాల్ అప్‌డేట్ చేయడం వివాదానికి కారణమైంది. న్యాయం చేయాలని అన్న వెళితే.. తమ్ముడి భూమిపైనా రిమార్క్ చేయడం చర్చనీయాంశమైంది. క్షేత్రస్థాయిలో తహసీల్దార్ విచారణ చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

**హైకోర్టుకు వెళ్లడంతో కదలిక..**

కొత్తపేటలో సర్వే నంబర్ 73లో 12.6 ఎకరాల భూమి ఉంది. ఇందులో ఒక ఎకరం ఒక గుంట భూమిని మహమ్మద్ జాఫర్ హుస్సేన్ అమ్మితే సేల్‌డీడ్ ప్రకారం అంకేశ్వరపు ఎల్లస్వామి పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారు. 1998లో జాఫర్‌హుస్సేన్ సోదరుడు మహమ్మద్ అఫ్జల్ ఒక ఎకరం భూమిని సాదాబైనామా పేపర్ ద్వారా ఎల్లస్వామి అన్న కొమురయ్యకు విక్రయించాడు. సేల్ డీడ్ చేసేందుకు డబ్బులు లేకపోవడం, సాదాబైనామా పేపర్ ఉంది కదా అని కొమురయ్య రిజిస్ట్రేషన్ పెద్దగా పట్టించుకోలేదు. 2020లో అప్పటి ప్రభుత్వం సాదాబైనామాలు రెగ్యులర్ చేస్తామని ప్రకటించింది. అదేసంవత్సరం నవంబర్ నాలుగో తేదీన అప్లికేషన్ నంబర్ టీటీఆర్ఓ 02200340675 ద్వారా మీ సేవలో దరఖాస్తు చేశాడు. కొందరు హైకోర్టుకు వెళ్లడంతో చాలా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల కొమురయ్య తన సాదాబైనామా దరఖాస్తును పరిష్కరించాలని హైకోర్టుకు వెళ్లడంతో 8 వారాల్లోగా విచారించి బాధితుడికి న్యాయం చేయాలని ఆదేశించింది.



వరంగల్ తహసీల్దార్ కార్యాలయం

**తప్పుదారి ఎందుకు పట్టిస్తున్నట్టు?**

సాదాబైనామా దరఖాస్తు పరిశీలించాలని హైకోర్టు ఆదేశాలు ఇస్తే తహసీల్దార్ ఇక్బాల్ మాత్రం తెరపైకి మరొకటి తీసుకొచ్చారు. పట్టాదారు పాస్ బుక్ జారీ కోసం ఆర్‌సీ 2400007402 అంకేశ్వరపు కొమురయ్య దరఖాస్తు చేసుకున్నారని, ధరణిలో తనిఖీ చేస్తే సర్వే నంబర్ 73/ఏ/3లో అంకేశ్వరపు ఎల్లస్వామి పేరు చూపిస్తుందంటూ మీ భూ పత్రాలతో హాజరుకావాలంటూ నోటీసు ఇచ్చారు. బాధితుడి తరఫు న్యాయవాది మాత్రం భూమి సర్వే నంబర్ 73ను సాదాబైనామా దరఖాస్తు సమయంలో సమర్పించామని, మహమ్మద్ అఫ్జల్ వద్ద రాసుకున్న సాదాబైనామా పత్రాలను కూడా జతచేశామని సమాధానమిచ్చారు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు కానీ ఎల్లస్వామి పేరు మీద ధరణిలో ఉన్న భూవివరాల్లో కోర్టు కేసు ఉందని అప్‌డేట్ దర్శనమిచ్చింది. కొమురయ్య హైకోర్టు వరకు వెళ్లినా ఇక్కడి అధికారుల తీరుతో అన్యాయం జరిగిందంటున్నారు. ధరణిలో తమకు భూమి విక్రయించిన మహమ్మద్ అఫ్జల్ నుంచి ఆయన కుమారులు మహమ్మద్ మహమూద్, మహమ్మద్ సర్వర్‌పాషా మీదకు పట్టా అయ్యినట్లు, తహసీల్దార్ మహమ్మద్ ఇక్బాల్ వచ్చిన ఐదు రోజుల వ్యవధిలోనే ఈ పని జరిగిందని అక్కడి రెవెన్యూ కిందిస్థాయి సిబ్బంది చెబుతున్నారని కొమురయ్య వాపోయాడు. 2020 ఏప్రిల్ నుంచి 2021 ఫిబ్రవరి 3 వరకు పనిచేసిన మహమ్మద్ ఇక్బాల్ ఇలా చేయడంలో ఆంతర్యమేమిటనే చర్చ రెవెన్యూ వర్గాల్లో జోరుగా జరుగుతోంది. దీనిపై ఓ రెవెన్యూ ఉన్నతాధికారి మాట్లాడుతూ ఈ విషయం కలెక్టర్ దృష్టిలో ఉందని, ఆమె ఆదేశాలకు అనుగుణంగా తదుపరి చర్యలు ఉంటాయన్నారు.


రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
Cell: 9989299661

## సాక్షి క్లాసిఫైడ్స్

**REAL ESTATE**

**HOUSE FOR SALE**

■ 45 చ॥గ॥ G+2 ఫర్నిషింగ్‌తో క్లియర్ టైటిల్ గలది. మెయిన్‌రోడ్‌కు దగ్గరలో ఎయిర్‌పోర్ట్ రోడ్, శంభునిపేట్, వరంగల్. Opp: రేనాల్ట్ స్కూల్ సంప్ర॥ 9391565095 / W: +18474431516. [WA-6552]

**SERVICES**

**BUSINESS SERVICES**

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్ మార్వడీ షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును 9160077916 స్పాట్ క్యాష్. [SCA25001608]

**WANTED**

■ Wanted PROs / Agents for MBBS, B.Tech abroad admissions. Cont: 8121554649. [WA-3281]

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు॥ కావలెను. జీతం: 25,000 నుండి 30,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-SCA25001637]

■ రియల్ ఎస్టేట్ ఆఫీస్‌లో పని చేయుటకు టెలికాలర్స్ కావలెను. జీతం 10000 నుండి 15000 వరకు. సెల్: 9014980722. [SCA25001640]

**EDUCATION**

■ రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, బి.టెక్, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA, P.hd, ఓపెన్ టెన్త్ & ఇంటర్ (4 నెలల్లో పూర్తి) Dr.J.S. అకాడమీ (ISO సర్టిఫైడ్) 8866977112. [HA-15389]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.